సాక్షి జనగామ

సోమవారం । 25 । ఆగస్టు । 2025



కాజీపేట రైల్వేడిపోకు పూర్వవైభవం

కాజీపేట జంక్షన్‌లోని రన్నింగ్ డిపోకు పూర్వవైభవం రానుంది. దసరా కానుకగా 190 పోస్టులకు అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

- 8లో▸



గూడ్స్‌షెడ్‌కు భారీగా ఎరువులు

వరంగల్ రైల్వేస్టేషన్ గూడ్స్‌షెడ్‌కు ఆదివారం కోరమండల్ కంపెనీకి చెందిన ఎరువులు భారీగా వచ్చాయి.

- 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం $32^0/24^0$

జిల్లాలో ఉదయం నుంచి ఎండగా ఉంటుంది. మధ్యాహ్నం వాతావరణం సాధారణంగా ఉండి, సాయంత్రం పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లా ఆస్పత్రిలో వాటర్ ఫిల్టర్ ప్రారంభం



జనగామ: జిల్లా ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్‌ను భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఆస్పత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం వాటర్ ఫిల్టర్ ఉపయోగపడుతుందన్నారు. అనంతరం దేవాదుల కాల్వల ద్వారా చెరువులను నింపాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అంతకుముందు ఎంపీని ఘనంగా స్వాగతించారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే క్రిమినల్ చర్యలు

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం: విద్యాసంస్థల్లో ఎవరైన విద్యార్థులు ర్యాగింగ్ లాంటి వికృత చేష్టలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ హెచ్చరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ర్యాగింగ్ నియంత్రణపై పోలీస్ కమిషనర్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు పాల్పడడం అనేది తీవ్రమైన నేరమని, ఈ చర్యలతో విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడుతుందని పేర్కొన్నారు. ర్యాగింగ్ నియంత్రణకు యాజమాన్యాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఇందులో భాగంగా యాంటీ ర్యాగింగ్ కమిటీలు, స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని, నూతనంగా వచ్చిన విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని ఆయన సూచించారు. ముఖ్యంగా ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన సదస్సులు, వర్క్‌షాపులు నిరంతరం నిర్వహించాలని, విద్యార్థులు ఫిర్యాదు చేసేందుకు 24గంటల హైల్ప్‌లైన్ నంబర్లను విద్యాసంస్థల యాజమాన్యం అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ఎవరైనా ర్యాగింగ్‌కు గురైతే తక్షణమే ప్రిన్సిపాల్, యాజమాన్యం, పోలీసులకు సమాచారం అందించాలని సీపీ కోరారు. విద్యాసంస్థల యాజమాన్యాలు, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసులు కలిసి పనిచేసినప్పుడే ర్యాగింగ్ సంస్కృతిని పూర్తిగా నిర్మూలించగలుగుతామని పోలీస్ కమిషనర్ తెలిపారు.

'టీసీ ఇవ్వండి.. లేదంటే బస్సులు నడిపించండి'

జనగామ: జనగామ మండలం చౌడారం మోడల్ స్కూల్‌కు సమయానుకూలంగా బస్సు సర్వీసులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు కర్ణాకర్, వేణు తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మారుమూల గ్రామం అడవిలో ఉన్న మోడల్ పాఠశాలకు వెళ్లాలంటే ఒక్క బస్సు మాత్రమే దిక్కుగా మారిందని, ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం జనగామ నుంచి చౌడారం మీదుగా మరిగడి వరకు రెండు బస్సులు నడిపిస్తున్నారు. ఈ బస్సులు సమయానుకూలంగా నడిపించకపోవడంతో వందలాది మంది పిల్లలు మొదటి పీరియడ్ ముగిసిన తర్వాత స్కూల్‌కు చేరుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతుందని తల్లిదండ్రులు అంటున్నారు. నేడు (సోమవారం) కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు మెజార్టీ తల్లిదండ్రులతో కలిసి వెళ్లి వినతి చేస్తామన్నారు. అప్పటికీ అధికారులు స్పందించకపోతే మూకుమ్మడిగా టీసీలు తీసుకుని మరో పాఠశాలకు పంపిస్తామన్నారు. ప్రభుత్వం సర్కారు బడుల అభ్యున్నతికి కృషి చేస్తుంటే, ఇక్కడ మాత్రం బస్సు కోసం బడిలో నుంచి పిల్లలు వెళ్లిపోయే పరిస్థితి రావడం దారుణమని విద్యావేత్తలు అంటున్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



జఫర్‌గఢ్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండిగ రాకేష్ కృష్ణన్ కోరారు. మండలకేంద్రంలో ఆదివారం మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఉచిత సన్నబియ్యం, ఉచిత విద్యుత్ పథకాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అంతకుముందు మండల కేంద్రానికి తొలిసారిగా వచ్చిన సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకులు ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాటికాయల రాజేందర్, నాయకులు సింగపురం అశోక్, గాదెపాక అనిల్‌కుమార్, మహేందర్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉచితంగా పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్న మట్టి గణపతులు



జనగామ పట్టణం బీరప్పగడ్డలో మట్టి గణపతుల అమ్మకాలు

మట్టి గణపతులకే జై

మట్టి ముద్దలకు మనోహర రూపాలు

- ఏటా పెరుగుతున్న మట్టి వినాయక విగ్రహాలు
- పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, వాసవీ కన్యకాపరమేశ్వరి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ
- ఐదు వేలకుపైగా విగ్రహాల తయారీ



ఎస్‌పీఆర్ స్కూల్‌లో మట్టి విగ్రహాలను తయారు చేస్తున్న విద్యార్థులు

సహజసిద్ధమైన ప్రకృతి ఒడిలో రసాయనాల కాలుష్యం రోజురోజుకు ఎక్కువ అవుతుంది. ప్లాస్టిక్ వ్యర్థాలు, ప్రమాదకర వాయువులతో పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నాయి. వినాయక చవితి అంటే ప్రతీ ఇంటా బొజ్జ గణపయ్య ప్రతిమలు ప్రతిష్ఠించడం ఆనవాయితీ. పూర్వకాలంలో మట్టి విగ్రహాలనే ఎక్కువగా పూజించేవారు. ఆధునిక పోకడలు పెరిగిపోవడం, రంగులను చూసి ఆకర్షణకు గురవుతూ, ఆర్భాటాలకు వెళ్తూ పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నారు. భవిష్యత్ తరాలను ఆలోచిస్తున్న పర్యావరణ వేత్తలు మట్టి విగ్రహాల ఆవశ్యకతను తెలియజేస్తూ, అటు తయారీదారులు, మరోవైపు ప్రజలను చైతన్య పరిచేవిధంగా ప్రయత్నిస్తున్నారు. మరో రెండు రోజుల్లో వినాయక చవితి పండుగ నేపథ్యంలో 'సాక్షి' ప్రత్యేక కథనం.

- జనగామ

చెరువు మట్టితో మనోహర రూపాన్ని..

తెలంగాణతో పాటు ఆంధ్రప్రాంతానికి చెందిన అనేక మంది కళాకారులు జిల్లాలో మట్టి ముద్దలను నమ్ముకుని బతుకు బండిని లాగిస్తున్నారు. ముక్కంటి లోకాల్లో మొదటగా ఆరాధించే గణపయ్యకు చెరువు మట్టితో మనోహర రూపాన్ని ఇస్తూ ఆ కళనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఏపీకి చెందిన ఎన్నో కుటుంబాలు పండుగ సమయంలో జిల్లాకు వచ్చి రెండున్నర దశాబ్దాలుగా మట్టి విగ్రహాలకు ప్రాణం పోస్తున్నారు. సాంప్రదాయ బద్ధంగా చెరువు మట్టితో గణపతి విగ్రహాలను తయారు చేస్తూ పర్యావరణ పరిరక్షణకు తమవంతు కృషి చేస్తున్నారు.

మట్టి గణపతుల పంపిణీ..

ప్రభుత్వం తరఫున పొల్యూషన్ కంట్రోల్ బోర్డుతో పాటు శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ సేవా సమితి(ఎస్‌వీకేపీఎస్‌ఎస్), పలు ప్రైవేట్ పాఠశాలల ఆధ్వర్యంలో ఐదువేలకు పైగా మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఇందులో ఎస్‌వీకేపీఎస్‌ఎస్ 1,111, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రెండువేలు, ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు ఎస్‌పీఆర్, ఏకశిల పబ్లిక్ స్కూల్ రెండువేల విగ్రహాలను సిద్ధం చేసి ఉంచారు. వినాయక చవితి పండుగ రోజు జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండలాల పరిధిలోని ప్రధాన కూడళ్లలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తారు. కాగా పట్టణంలోని బీరప్పగడ్డ ప్రాంతంలో నిడిగొండ దేవేందర్ ఏడు ఫీట్ల ఎత్తులో ఉన్న మట్టి విగ్రహాలను తయారు చేసి అమ్మకాలు చేస్తున్నారు. రూ.12 నుంచి రూ.30వేల వరకు ఇక్కడ మట్టి గణపతులు అందుబాటులో ఉన్నాయి.

జోరుగా విగ్రహాల విక్రయాలు



జనగామ: వినాయక ప్రతిమలను కొనుగోలు చేస్తున్న గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు



స్టేషన్‌ఘన్‌పూర్: గణపతి విగ్రహాలకు తుదిమెరుగులు దిద్దుతున్న కె.సీతయ్య

- రూ.2 వేల నుంచి రూ.20వేల వరకు..



జనగామ: జిల్లాలో వినాయక విగ్రహాల విక్రయాలు ఊపందుకుంది. ఈ నెల 27 నుంచి వినాయక చవితి పండగను పురస్కరించుకుని జిల్లా కేంద్రంతో పాటు స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో విగ్రహాల అమ్మకాలు జోరందుకున్నాయి. రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన కుటుంబాలు ఇక్కడే స్థిర నివాసం ఏర్పరచుకుని 2వేల వినాయక ప్రతిమలను తయారు చేసి అమ్మకాలు చేస్తున్నారు. ఇక్కడ తయారైన విగ్రహాలు సూర్యాపేట, సిద్దిపేట, నల్లగొండ, చేర్యాలతో పాటు జిల్లాలోని ఆయా మండలాలకు సప్లయ్ చేస్తున్నారు. పలువురు వ్యాపారులు హైదరాబాద్ నుంచి హోల్‌సేల్‌గా మరో 2వేల విగ్రహాలు కొనుగోలు చేసి, ఇక్కడ రిటేయిల్‌గా అమ్మకాలు చేస్తున్నారు. అయితే వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో విగ్రహాల అమ్మకాల నిర్వాహకులు కొంత ఆందోళనలో ఉన్నారు.

భక్తిని పెంపొందించే డిజైన్లలో..

వినాయక ప్రతిమలను చూడగానే భక్తిని పెంపొందించే విధంగా వివిధ దేవతామూర్తులతో కలిసి ఉండి ఆకట్టుకునే గణపతులను తయారు చేశారు. సుమారు 10 ఫీట్ల ఎత్తులో విభిన్న రూపాల్లో ఉన్న విగ్రహాలు రూ.2వేల నుంచి రూ.20 వేల వరకు ధర పలుకుతున్నాయి.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న మట్టి వినాయకులు

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి




వినాయక చవితి పండుగ వేళ ప్రజలు మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలి. బీసీ సంక్షేమ సంఘం అధికారుల ఆధ్వర్యంలో మట్టి గణపతులను తయారు చేసే కుమ్మరి, శాలివాహన కులస్తులకు తగిన ప్రోత్సాహం, ఆర్థిక తోడ్పాటు అందించాలి. మున్సిపల్ కమిషనర్లు, జిల్లా కాలుష్య నియంత్రణ శాఖ అధికారులు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేసి ప్రోత్సహించాలి.

- రిజ్వాన్ బాషా, కలెక్టర్

ఎస్జీటీలకు ఎస్‌ఏలుగా పదోన్నతి

- 172 ఖాళీలు.. 88 మందికి పదోన్నతులు
- నేడు వెబ్ ఆప్షన్లు.. రేపు ఆర్డర్ కాపీలు



జనగామ: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ)కు పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతుంది. స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ) పదోన్నతుల కోసం జిల్లా విద్యాశాఖ ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసి, నిబంధనలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నారు. సీనియార్టీ ప్రకారం జిల్లాలో 172 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉండగా, 88 మందికి పదోన్నతి లభించనుంది. ఇందుకు సంబంధించి నేడు వెబ్‌ఆప్షన్లు నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేయగా, 26న ప్రమోషన్ ఆర్డర్లు విడుదల చేయనున్నారు. గతంలోనే సీనియార్టీ కలిగిన 20 మంది స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ హెడ్ మాస్టర్లుగా పదోన్నతి పొందిన నేపథ్యంలో, మిగిలిన ఖాళీలను ఎస్జీటీలతో భర్తీ చేస్తున్నారు. డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. డీఈఓజనగామ. కామ్‌లో పదోన్నతుల జాబితాను అప్‌లోడ్ చేశారు. ఈ జాబితాలో ఉన్న మొబైల్ నంబర్‌ను పదోన్నతి పొందనున్న టీచర్లు ధ్రువీకరించడంతో పాటు రిజిస్టర్ ఫోన్ నంబర్‌కు వచ్చే ఓటీపీతో వెబ్ ఎంపిక ప్రక్రియ మొదలవుతుంది. మొబైల్ నంబర్‌తో తప్పుగా ఉంటే వెంటనే సరి చేసుకోవాలని డీఈఓ ఆదేశించారు. పదోన్నతుల తర్వాత విద్యాశాఖలో ఖాళీలను డీఎస్సీ ద్వారా భర్తీ చేయనుంది.

సబ్జెక్టుల వారీగా పదోన్నతి పొందుతున్న ఎస్జీటీలు

పీఎస్ హెచ్‌ఎం 22, బయాలజీ 15, సోషల్ 24, గణితం 6, ఫిజిక్స్ 5, ఇంగ్లిష్ 9, తెలుగు 1, హిందీ 2, ఫిజికల్ డైరెక్టర్ 1, స్పెషల్ ఎడ్యుకేషన్ 3 ఎస్జీటీలు పదోన్నతి పొందనున్నారు.

భక్తిశ్రద్ధలతో తీజ్ ఉత్సవాలు

పెద్ద ఎత్తున శోభాయాత్ర

- ఆధ్యాత్మిక వాతావరణంలో తీజ్ బుట్టల నిమజ్జనం



సంప్రదాయ దుస్తులతో బంజారా మహిళలు

జనగామ : జనగామ జిల్లాలో తీజ్ ఉత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో సేవాలాల్ మహరాజ్‌కు గిరిజనులు ప్రత్యేక పూజలు చేశారు. తండాలతో పాటు జనగామ పట్టణంలో తీజ్ వేడుకలు అంబరాన్నంటాయి. సంప్రదాయ నృత్యాలతో బంజారా మహిళలు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. మహిళలు, యువకులు, చిన్నారులంతా పాల్గొని తీజ్ పండుగను వైభవంగా నిర్వహించారు.

పట్టణంలో శోభాయాత్ర

జనగామ పట్టణంలో స్థానిక బంజారాలు తీజ్ ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ మహరాజ్, మేరమా యాడి, జగదాంబ మాత ఆశీస్సులతో మొదలైన ఉత్సవాల్లో బంజారా పెద్దలు, యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. తరతరాలుగా బంజారాలు అడవి జీవన విధానంలో అలవాటు పడి, ప్రకృతినే ఆరాధిస్తూ జీవనం సాగిస్తున్నారని పెద్దలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సకల సంపదల మూలమే ప్రకృతి అని చాటి చెప్పే ఈ తీజ్ పండుగ బంజారాల ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. పెళ్లి కాని అమ్మాయిలు తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో తీజ్ వేడుకలను ఆచరిస్తూ, తండావాసుల సంక్షేమం కోసం, చక్కటి వరుడు దొరకాలని దేవుడిని కోరుకునే పండుగ తీజ్ అని పేర్కొన్నారు. వేడుకలో చివరి రోజు సుమారు ఐదు వందల మంది బంజారాలు పాల్గొని పట్టణంలో భారీ శోభాయాత్రను నిర్వహించారు. అనంతరం తీజ్ బుట్టలను భక్తిశ్రద్ధలతో చెరువులో నిమజ్జనం చేశారు. మాజీ కౌన్సిలర్ వాంకుడోత్ అనిత, డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్, వంశీ, లాలమ్మ, రవి, కిషన్, డాక్టర్ బాలాజీ స్వప్న రాథోడ్, ప్రదీప్, శంకర్, డాక్టర్ రఘు, దేవి, మంజుల, పద్మ, విజయ, లలిత పాల్గొన్నారు.



తీజ్ బుట్టలతో మహిళలు, యువతులు

యూరియా కోసం బారులు

నర్మెట: యూరియా కోసం రైతులు మండల ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం ఎదుట ఆదివారం బారులుదీరారు. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు యూరియా కొరత లేనప్పటికీ యూరియా రావడంలేదనే పుకార్లతోనే ఆందోళన చెందిన రైతులు పీఏసీఎస్ ఎదుట ఇలా బారులుదీరారు. దీంతో పీఏసీఎస్‌లో ఉన్న 333 బస్తాలను రైతులకు అందించారు. జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు, షాపుల యజమానులు తెలిపారు.



పీఏసీఎస్ ఎదుట బారులుదీరిన రైతులు

గణపతి రుద్రుడిగా రుద్రేశ్వరస్వామికి అలంకరణ



హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల ఆలయంలో భాద్రపద మాసం శుద్ధ పాడ్యమి ఆదివారం శ్రీరుద్రేశ్వరస్వామి వారిని గణపతి రుద్రుడిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు గంగు మణికంఠశర్మ, అర్చకులు పానుగంటి ప్రణవ్, పెండ్యాల సందీప్‌శర్మ ఉదయం నుంచి ప్రభాతసేవ, ఉత్తిష్ట గణపతి ఆరాధన, రుద్రేశ్వరస్వామికి రుద్రాభిషేకం, సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు.

ఘనంగా స్తంభం పాకుడు



స్తంభం పాకుతున్న యువకులు

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని ఇప్పగూడెంలో కృష్ణాష్టమి తొమ్మిదో రోజున ప్రతీ ఏటా నిర్వహించే స్తంభం పాకుడు వేడుకలను ఆదివారం వేణు గోపాలస్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ కచేరి వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఇనుప పైప్ స్తంభం పాకే కార్యక్రమాన్ని నిర్వహించగా యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. వెంకటేష్ అనే యువకుడు స్తంభంపై వరకు పాకి విజేతగా నిలువగా అందరూ అభినందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దామెర వేణు, జూలుకుంట్ల ప్రకాశ్‌రెడ్డి, దార్న శ్రీధర్, పోకల చందర్, రామజ్యోతి, శ్రీను, నరేష్, రాజు, శ్రీను, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

గోదావరి జలాలు తీసుకొస్తా

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



వేలేరులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వేలేరు: వచ్చే యాసంగి నాటికి పైప్‌లైన్ పనులు పూర్తి చేసి గండిరామారం రిజర్వాయర్ నుంచి వేలేరు మండలానికి గోదావరి జలాలు తీసుకొచ్చి మండలంలోని రైతులకు సాగునీరందిస్తానని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం మండలంలోని మల్లికుదుర్ల, సోడాషపల్లి, పీచర, శాలపల్లి, లోక్యాతండా, వేలేరు గ్రామాల్లో పనుల జాతర-25 కార్యక్రమంలో భాగంగా రూ.3 కోట్ల 69 లక్షల 35 వేల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈసందర్భంగా వేలేరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలానికి సంబంధించిన ఎంపీడీఓ కార్యాలయ నిర్మాణానికి మరో రూ.2.50 కోట్లు నిధులు పెంచి ఇవ్వాలని ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. 15 ఏళ్ల ఎమ్మెల్యేగా పని చేసిన ఓ వ్యక్తి పాలనను గాలికి వదిలి పదవిని అడ్డం పెట్టుకుని పదవులు, పనులు, పథకాలు అమ్ముకుని అక్రమంగా సంపాదించాడని విమర్శించారు.

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

వేలేరు మండలం మల్లికుదుర్లలోని ఎస్సీ కాలనీలో రూ.25 లక్షలు, సోడాషపల్లిలో రూ.25 లక్షలు, పీచరలో రూ.33.20 లక్షలు, శాలపల్లిలో రూ.16.60 లక్షలు, వేలేరులో రూ.45.55 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. శాలపల్లిలో రూ.12 లక్షలు, లోక్యాతండాలో రూ.12 లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. లోక్యాతండా నుంచి పీచర వరకు రూ.2 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ పీడీ మేన శ్రీను, పీఆర్ ఈఈ ఆత్మరామ్, అగ్రికల్చర్ ఏడీ ఆదిరెడ్డి, డీడ బ్యూఓ జయంతి, తహసీల్దార్ కోమి, ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, పీఆర్ డీఈ శిరీష, పీఆర్‌ఏఈ రూపావతి, ఏఓ కవిత, ఎంపీఓ భాస్కర్, మాజీ ఎంపీపీ సమ్మిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కత్తి సంపత్, నాయకులు మల్లికార్జున్, బిల్లా యాదగిరి, సద్దాం హుస్సేన్, సమ్మయ్య, రాజిరెడ్డి, ప్రమోద్ రెడ్డి, లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ భూములపై సీఎం చొరవ చూపాలి



దీక్షలో పాల్గొన్న జిల్లా టీఎన్జీఓ నాయకులు

- టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు ఖాజా షరీఫ్

జనగామ: భాగ్యనగర్ హౌసింగ్ సొసైటీ భూములకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపించాలని జిల్లా టీఎన్జీఓ అధ్యక్షుడు ఖాజా షరీఫ్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ గచ్చిబౌలిలో జరిగిన దీక్షకు జిల్లా ఉంచి టీఎన్జీఓ నాయకులు తరలి వెళ్లారు. జూబ్లీహిల్స్ గోపాల్‌పూర్‌లోని సర్వే 142 ఎకరాల భూమిని భాగ్యనగర్ హౌసింగ్ సొసైటీ ఉద్యోగులకు గత ప్రభుత్వం కేటాయించిందని, సీఎం ప్రత్యేక దృష్టి సారించి సొసైటీ సభ్యులకు స్థలాలను ఇప్పించాలన్నారు. ఆయన వెంట జిల్లా కార్యదర్శి పెండెల శ్రీనివాస్, పేర్వారం ప్రభాకర్, ఎండీ హఫీజ్, నాగార్జున తదితరులు ఉన్నారు.

ముగిసిన చదరంగం పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా చదరంగం సమాఖ్య ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం జిల్లాస్థాయి మూడో ర్యాంకింగ్ చదరంగ పోటీలు ముగిశాయి. ముఖ్య అతిథిగా ఎస్‌బీటీ టెక్నికల్ ఆఫీసర్ సుధాకర్ హాజరై విజేతలకు సర్టిఫికెట్లు, పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఇరిగేసి అర్జున్‌ను స్ఫూర్తిగా తీసుకుని చదరంగంలో రాణించాలని సూచించారు. నిర్వాహణ కార్యదర్శి పి.కన్నా మాట్లాడుతు అండర్ -7,9,11,13,15 బాలబాలికల విభాగాల్లో నిర్వహించిన పోటీలకు జిల్లా వ్యాప్తంగా 70 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు.

క్లుప్తంగా

కాజీపేట మీదుగా ప్రత్యేక రైళ్లు

- సెప్టెంబర్ నుంచి ఆరు స్పెషల్ ట్రైన్ సర్వీస్‌లు



కాజీపేట రూరల్ : ప్రయాణికుల సౌకర్యార్థం దీపావళి, ఛాత్, విజయదశమి పండుగల సందర్భంగా కాజీపేట జంక్షన్, వరంగల్ మీదుగా సంత్రగచ్చి–చర్లపల్లి మధ్య ఆరు ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ ఆదివారం తెలిపారు.

ప్రత్యేక రైళ్ల వివరాలు..

సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు సంత్రగచ్చి–చర్లపల్లి (08845) ఎక్స్‌ప్రెస్ ప్రతీ శుక్రవారం సంత్రగచ్చిలో బయలుదేరి శనివారం కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటుంది. అదేవిధంగా సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు చర్లపల్లి–సంత్రగచ్చి (08846) ఎక్స్‌ప్రెస్ ప్రతీ శనివారం కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటుంది. ఈ రైళ్ల సర్వీస్‌లకు అప్‌అండ్ డౌన్ రూట్‌లో ఖరగ్‌పూర్, బాలాసోర్, బద్రఖ్, కటక్, భువనేశ్వర్, ఖుర్ధ రోడ్, బెరహంపూర్, విజయనగరం, సింహాచలం, దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, రాయన్‌పాడ్, ఖమ్మం, వరంగల్, కాజీపేట స్టేషన్లలో హాల్టింగ్ కల్పించారు.

రైలు నుంచి జారి పడి యువకుడి దుర్మరణం

ఖిలా వరంగల్: రైలు నుంచి జారి పడి ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన నెక్కొండ స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ జి. సుదర్శన్ కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని గోండియా జిల్లా సదక్ అర్జనీ గ్రామానికి చెందిన రామేశ్వర శ్రీరామజీ బోయర్(28) ఆదివారం ఉదయం గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఆధార్, ఓటర్ కార్డుల ఆధారంగా మృతుడి బంధువులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించి భద్ర పర్చినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఎస్ఎస్‌తాడ్వాయి: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన శనివారం రాత్రి వెంగ్లాపూర్ గ్రామంలో జరిగింది. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి కథనం ప్రకారం... వెంగ్లాపూర్ గ్రామానికి చెందిన ఆలెం సురేశ్ (40) కుమార్తె లాస్య ఆరోగ్యం బాగా లేకపోవడంతో ములుగు ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. వెంగ్లాపూర్ దాటిన తర్వాత ఐకేపీ సెంటర్ వద్ద రాత్రి సుమారు 7 గంటల ప్రాంతంలో ట్రాక్టర్ ట్రాలీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈఘటనలో సురేశ్‌కు బలమైన గాయాలు, కుమార్తె లాస్యకు స్వల్ప గాయాలయ్యాయి. 108లో ములుగు ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యాధికారి పరీక్షించి సురేశ్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆదివారం మృతుడి తల్లి ఎర్రక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

మహిళను బెదిరించిన వ్యక్తిపై కేసు

గీసుకొండ : గీసుకొండ మండలం కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ) వద్ద ఓ మహిళను బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు అయ్యింది. పోలీసుల కథనం ప్రకారం.. సంగెం మండలం చింతలపల్లి తండాకు చెందిన ఆంగోత్ కమల కేఎంటీపీలో హోటల్ నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో శనివారం రఫీక్ అనే డ్రైవర్ హోటల్‌లో టీ తాగిన అనంతరం చిట్టీపై తన ఫోన్ నంబర్ రాసి అందులో డబ్బులు పెట్టి ఆమెకు ఇచ్చాడు. ఇలా ఎందుకు ఇచ్చావని కమల ప్రశ్నించగా ఆమెను దుర్భాషలాడుతూ చంపుతానని బెదిరించాడు. దీంతో సదరు మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ సీఐ మహేందర్ ఆదివారం తెలిపారు.

గ్రామాల్లో 'పనుల జాతర'

ఊరూరా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

- జీపీ, అంగన్‌వాడీ భవనాలకు ప్రాధాన్యం
- జిల్లాలో 278 పనులకు రూ.1.35కోట్లు కేటాయింపు



శామీర్‌పేటలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ (ఫైల్)

జనగామ రూరల్: గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి, నిరుపేద కూలీల కుటుంబాలకు జీవనోపాధి పెంచేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. శాఖల సమన్వయంతో జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఒకేసారి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, పూర్తయిన పనులను ప్రారంభించాలని నిర్ణయించింది. 'పనుల జాతర–2025' పేరుతో నిర్వహించే కార్యక్రమానికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో జిల్లాలోని 12 మండలాల పరిధి 283 గ్రామాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మొత్తం 278 పనులకు రూ.1.35 కోట్లు కేటాయించారు.

'ఉపాధి'కి కొత్తరూపం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేదలకు ఉపాధి కల్పనకే కాకుండా శాశ్వత ఆస్తులను సృష్టించేందుకు దోహదపడనుంది. ఈ మేరకు పనుల జాతర కార్యక్రమం ద్వారా వేలాది మందికి పని కల్పించడం సాధ్యమవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇదే సమయంలో వ్యక్తిగత, సామూహిక ఆస్తుల కల్పన పనులతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊపు తీసుకురానున్నారు.

ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

'పనుల జాతర'లో భాగంగా పూర్తయిన పనులు ప్రారంభోత్సవం, చేయాల్సిన పనులకు శంకుస్థాపనలు చేస్తున్నారు. ఇందులో గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ భవనాలకు ప్రాధాన్యం కల్పించనున్నారు. స్వచ్ఛభారత్ మిషన్ (గ్రామీణ) ద్వారా నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు 'జలనిధి' పథకం ద్వారా చేపట్టనున్న పనులకు కూడా భూమిపూజ చేస్తారు. అలాగే పశువుల కొట్టాలు, కోళ్లు, గొర్రెల షెడ్లు, ఎరువుల తయారీ కేంద్రాలు తదితర వాటిని నిర్మించనున్నారు.

నిస్వార్థ సేవకులకు సన్మానం

సామూహికంగా చేపట్టే ఈ కార్యక్రమం అభివృద్ధి పనులకే పరిమితం కాకుండా, గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధి కూలీలు, దివ్యాంగులు, పారిశుద్ధ్య కార్మికులు, హరిత సంరక్షకులను అధికారులు సన్మానించనున్నారు. ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు పాల్గొనేలా షెడ్యూల్ రూపొందించారు.

మండలాల వారీగా పనుల జాతర వివరాలు

మండలం	పనుల సంఖ్య	ఎస్టిమేషన్ నిధులు (రూ.లక్షల్లో)
బచ్చన్నపేట	26	11.27
చిల్పూరు	17	11.15
దేవరుప్పుల	32	15.71
స్టేషన్‌ఘన్‌పూర్	15	10.32
జనగామ	21	13.16
కొడకండ్ల	21	9.82
లింగాలఘణపురం	21	9.73
నర్మెట	17	54.22
పాలకుర్తి	36	13.16
రఘునాథపల్లి	36	20.53
తరిగొప్పుల	15	7.70
జఫర్‌గఢ్	21	7.68

సమన్వయంతో పనిచేయాలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా అమలు చేస్తున్న పనుల జాతర కార్యక్రమాన్నిర అధికారులు సమన్వయంతో పని చేసి లక్ష్యాలు పూర్తి చేయాలి. ఆయా గ్రామాల్లో చేపట్టే పనులు ప్రణాళిక ప్రకారం లక్ష్యాలు నిర్దేశించుకొని పనులు చేపట్టాలి. అంగన్‌వాడీలు, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలు పూర్తి చేయాలి.

\- రిజ్వాన్ బాషా, కలెక్టర్

సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్యాం యాదవ్

హన్మకొండ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న ఉదయం 11 గంటలకు హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేపట్టనున్న సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని ఆ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యాం యాదవ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులి శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలోని సంఘం కార్యాలయంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రంజిత్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని చెప్పిందన్నారు. బీసీలకు రిజర్వేషన్ల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లును ఆమోదం తెలిపేలా ఒత్తిడి పెంచాలన్నారు. స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా ముందుకు వెళ్తే యుద్ధం చేస్తామన్నారు. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు సోల్తి సారయ్య, నాయకులు బాబు యాదవ్, సొగాని శ్రీనివాస్, బగ్గి రాజు, సనత్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల డిగ్రీ సెమిస్టర్ల పరీక్షల ఫలితాల విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి, అధ్యాపకులు

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్)లో బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ మొదటి, రెండు, ఐదో (బ్యాక్‌లాగ్) సెమిస్టర్ పరీక్షల ఫలితాలను ఆదివారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి విడుదల చేశారు. ఈ పరీక్షలకు మొత్తం 1,014మంది విద్యార్థులు హాజరుకాగా అందులో 355మంది (35శాతం)ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, ఆ కళాశాల పరీక్షల నియంత్రణాధికారి సుధీర్, అధ్యాపకులు గిరిప్రసాద్, శ్రీదేవి, నహిదాపర్వీన్, జితేందర్,రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు రాజేందర్‌పై క్రిమినల్ కేసు



రాజేందర్ అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ సంపత్‌కుమార్

భూపాలపల్లి అర్బన్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు పెండ్యాల రాజేందర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ ప్రకటనలో తెలిపారు. రాజేందర్ మూడు రోజుల క్రితం పాఠశాలలో విద్యార్థులు తాగే ఆర్వో ప్లాంట్‌లో క్రిమిసంహారక మందు కలిపినట్లు నిర్ధారించామని పేర్కొన్నారు. ఎంఈఓ దేవానాయక్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేట్టారు. ఇందులో ప్రస్తుత ప్రత్యేకాధికారి వెంకటనర్సయ్యపై వ్యక్తిగత విభేదాల కారణంగా పాఠశాల ప్రతిష్ఠను దెబ్బతీసేలా రాజేందర్ కుట్ర పన్నినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. కుట్రలో భాగంగా ఈ నెల 21వ తేదీన రాత్రి తాగునీటి ట్యాంకులో హానికర పురుగులమందు కలిపినట్లు విద్యార్థులు గమనించి పోలీసులకు తెలిపారన్నారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టి రాజేందర్ తాగునీటిలో విషం కలిపారని నిర్ధారించినట్లు తెలిపారన్నారు.

దర్యాప్తు కొనసాగుతోంది..

తాగునీటిలో క్రిమిసంహారక మందు కలిపిన ఘటనలో ఉపాధ్యాయుడు రాజేందర్‌ను అరెస్ట్ చేసినట్లు భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల ప్రాణాలకు ముప్పు కలిగించే ఈ తరహా దారుణ చర్యలకు పాల్పడిన వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేలేదన్నారు. ఈ కేసులో ఇతరుల ప్రమేయం ఉందా అనే అంశాన్ని పరిశీలిస్తున్నామని, దర్యాప్తు పూర్తి స్థాయిలో కొనసాగుతోందన్నారు. సమావేశంలో సీఐ నరేశ్‌కుమార్, ఎస్సై సాంబమూర్తి పాల్గొన్నారు.

గూడ్స్ షెడ్‌కు భారీగా ఎరువులు



గూడ్స్‌కు చేరిన కోరమండల్ ఎరువులను పరిశీలిస్తున్న ఏఓ రవీందర్‌రెడ్డి

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేస్టేషన్ గూడ్స్‌షెడ్‌కు ఆదివారం కోరమండల్ కంపెనీకి చెందిన ఎరువులు భారీగా వచ్చాయి. 20:20:0:13 రకం 1844 మెట్రిక్ టన్నులు, 15:15:15 రకం 526 మెట్రిక్ టన్నులు, 16:20:0:13 రకం 319 మెట్రిక్ టన్నులు చేరాయి. కోరమండల్ ఎరువులను రికార్డుల ప్రకారం వ్యవసాయ అధికారులు విజ్ఞాన్, రవీందర్‌రెడ్డి పరిశీలించారు. కలెక్టర్ సత్యశారద, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ ఆదేశాల ప్రకారం కోరమండల్ ఎరువులను నిబంధనల ప్రకారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పీఏసీఎస్ గోదాంలు, ఫర్టిలైజర్ షాపులకు పంపించనున్నట్లు వ్యవసాయ అధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు. అలాగే, సోమవారం ఆర్‌సీఎఫ్ కంపెనీకి చెందిన 1,319.12 మెట్రిక్ టన్నుల యూరియా నగరానికి రానుందని, దీంతో ఉమ్మడి జిల్లా రైతుల యూరియా కష్టాలు తీరనున్నాయని జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ పేర్కొన్నారు.

ఎస్సై శ్రీకాంత్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ ఎస్సై శ్రీకాంత్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని ఫాస్ట్ ఫుడ్‌సెంటర్ నిర్వహిస్తున్న దళిత మహిళ సంద్ర మరియమ్మ, ఆమె కుమారుడు శేఖర్‌పై ఎస్సై శ్రీకాంత్ కులం పేరుతో దూషించి చేయి చేసుకున్న ఘటనలో మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకోగా..ఆదివారం ఇరువురిపై కేసులు నమోదయ్యాయి. బాధితురాలు మరియమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీకాంత్, కానిస్టేబుల్ రాజుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదుకాగా.. ఎస్సై ఫిర్యాదుతో ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వాహకురాలు మరియమ్మ, ఆమె కుమారుడు శేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేశ్ తెలిపారు.

ముగిసిన టేబుల్ టెన్నిస్ పోటీలు



విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న అతిథులు

హసన్‌పర్తి: నగరంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఇండోర్ స్టేడియంలో రెండు రోజులపాటు నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు ఆదివారం ముగిశాయి. టేబుల్ టెన్నిస్ వెటరన్ క్రీడాకారుడు రమేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ క్రీడలతో క్రమశిక్షణ, స్నేహభావం పెంపొందుతుందన్నారు. అనంతరం విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ హరీశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కిట్స్ కళాశాల ఏఓ డాక్టర్ రమేశ్‌రెడ్డి, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ మోహన్‌రావు, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్లు డాక్టర్ జైసింగ్ అజ్మీరా, సునీల్ కుమార్, కార్యనిర్వాహక సభ్యులు రవికుమార్, వెంకటస్వామి, మహేశ్, డాక్టర్ ప్రభాకరాచారి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు



విజేతగా నిలిచిన వరంగల్ పురుషుల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

- చాంపియన్‌గా ఆదిలాబాద్, వరంగల్ జట్లు

రెబ్బెన: కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో కొనసాగుతున్న 71వ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ముగిశాయి. ఆదివారం జరిగిన ఫైనల్‌లో ఆదిలాబాద్ మహిళ జట్టు విజేతగా నిలువగా పురుషుల విభాగంలో వరంగల్ జిల్లా జట్టు విజయకేతనం ఎగురేసింది. సెమీఫైనల్‌తోపాటు ఫైనల్ పోటీలు నిర్వహించగా క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. ఫైనల్‌లో ఆదిలాబాద్ జిల్లా మహిళల జట్టు వరంగల్ జట్టుతో తలపడింది. పురుషుల విభాగంలో వరంగల్ జిల్లా క్రీడాకారులు రంగారెడ్డి జిల్లాతో తలపడ్డారు.

పోటీలతో స్నేహభావం..

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల నిర్వహణతో వివిధ జిల్లాల క్రీడాకారుల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తిరుపతి, బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ భాస్కర్‌రెడ్డి, ఎస్వోటూజీఎం రాజమల్లు, బాల్‌బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.నారాయణరెడ్డి, ప్రధానకార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట రైల్వే డిపోకు పూర్వ వైభవం

- దసరా కానుకగా కొత్త పోస్టులు ఇండెంట్
- 190 ఎల్‌పీ, ఏఎల్‌పీ పోస్టులకు గ్రీన్‌సిగ్నల్
- రన్నింగ్ స్టాఫ్ క్రూ రివ్యూలో నిర్ణయం
- ఫలించిన ఎంపీ, ఎమ్మెల్యే, రైల్వే నాయకుల కృషి



కాజీపేట రైల్వే రన్నింగ్ డిపో

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లోని రన్నింగ్ డిపోకు త్వరలో పూర్వ వైభవం రానుంది. ఐదేళ్ల క్రితం వెలవెలబోయిన కాజీపేట జంక్షన్‌కు మహర్దశ పట్టనుంది. ఇటీవల సికింద్రాబాద్‌లో జరిగిన రన్నింగ్‌స్టాఫ్ రివ్యూలో రైల్వే అధికారులు కాజీపేట రన్నింగ్ డిపోను దృష్టిలో పెట్టుకొని దసరా కానుకగా కొత్తగా పోస్టులు ప్రకటించారు. 90 గూడ్స్ అసిస్టెంట్ లోకో పైలెట్లు, 90 అసిస్టెంట్ లోకో పైలెట్లు, 10 ప్యాసింజర్ అసిస్టెంట్ లోకో పైలెట్లను కలుపుకొని కొత్తగా 190 పోస్టులను అధికారులు అలాట్‌మెంట్ చేసినట్లు రైల్వే ట్రేడ్ యూనియన్ నాయకులు ఆదివారం తెలిపారు. గతంలో కాజీపేట జంక్షన్ నుంచి డోర్నకల్, విజయవాడ రైల్వే డిపోలకు రైల్వే క్రూ లింక్‌లు, లోకోపైలెట్లను తరలించి ప్రాధాన్యతను తగ్గించారని పేర్కొన్నారు. ఇప్పుడు కొత్త పోస్టులతో ఆ సమస్య లేకుండా పోయిందని వివరించారు. కాజీపేట నుంచి క్రూ లింక్‌లను తరలించి ఈ ప్రాంతాన్ని నిర్వీర్యం చేయవద్దని గతంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, రైల్వే నాయకులు రైల్వే జీఎం, డీఆర్ఎంపై ఒత్తిడి తెచ్చారు. దీంతో నాటి రైల్వే జీఎం కాజీపేటకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కాజీపేటకు అలాట్ చేసిన కొత్త పోస్టులతో మొత్తం కాజీపేట రైల్వే రన్నింగ్ డిపో 720 మంది స్టాఫ్‌తో సికింద్రాబాద్ డివిజన్‌లో పెద్ద డిపోగా మారనుంది. బెల్లంపల్లి, డోర్నకల్‌తోపాటు ఇతర రైల్వే డిపోల్లో పనిచేస్తూ కాజీపేటకు రెక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ పెట్టుకున్న వారు ఇక్కడికి బదిలీపై వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

కాజీపేట రైల్వే డిపోపై ప్రత్యేక శ్రద్ధ..

వయా కరీంనగర్ మీదుగా భీమవరం–నాందేడ్‌కు సెప్టెంబర్ 5వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఎక్స్‌ప్రెస్ రైలుకు కాజీపేట రైల్వే డిపోకు చెందిన క్రూ వారే (లోకోపైలెట్, అసిస్టెంట్ లోకోపైలెట్, ట్రెయిన్‌మేనేజర్–గార్డు) పనిచేసే అవకాశం ఉందని, అప్ అండ్ డౌన్ రూట్‌లో ఈ రైలుకు ఆరుగురు రన్నింగ్ స్టాఫ్ పనిచేస్తారని రైల్వే నాయకులు తెలిపారు. భవిష్యత్‌లో కరీంనగర్ మీదుగా నిజామాబాద్, నాందేడ్ వరకు ఎక్కువ రైళ్లను ప్రవేశపెట్టి నడిపించే క్రమంలో దక్షిణ మధ్య రైల్వే అధికారులు కాజీపేట రైల్వే డిపోపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారని పేర్కొన్నారు.

రైల్వే నాయకుల హర్షం..

కాజీపేట రైల్వే డిపోకు కొత్తగా సికింద్రాబాద్ రైల్వే అధికారులు 190 ఎల్‌పీ, ఏఎల్‌పీల పోస్టులను మంజూరు చేసినందుకు కాజీపేట రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ లోకో రన్నింగ్ బ్రాంచ్ చైర్మన్ పాక రాజ్‌కుమార్, కాజీపేట రైల్వే మజ్దూర్ యూనియన్ లోకోరన్నింగ్ బ్రాంచ్ సెక్రటరీ పి.సాయికుమార్ హర్షం వ్యక్తం చేశారు.

పది క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

దంతాలపల్లి: మండల కేంద్రంలో శనివారం రాత్రి జిల్లా టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో 10క్వింటాళ్ల నల్లబెల్లం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ నీరజ తెలిపారు. మండల కేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా తవేరా వాహనంలో 10క్వింటాళ్ల నల్లబెల్లం, 90కేజీల పటిక, 10లీటర్ల గుడుంబా పట్టుబడిందన్నారు. బీదర్ నుంచి మహబూబాబాద్‌కు బెల్లాన్ని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి, డ్రైవర్ భుక్య రమేష్‌ను అరెస్ట్ చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు

మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి కేజీబీవీలో ఆగస్టు 4వ తేదీన జరిగిన ఆహారం కలుషిత ఘటనలకు కారకులైన సిబ్బంది ఎస్ఓ శైలజ, పీఈటీ శ్రావణిని విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ రాహుల్ శర్మ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయమై ఎలాంటి నిర్లక్ష్యం, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం, అధికారుల సూచనలు పట్టించుకోకపోవడంతో పీఈటీ శ్రావణిని, అదే పాఠశాలలో పర్యవేక్షణలో విఫలమైన నేపథ్యంలో ప్రత్యేకాధికారి శైలజను విధుల నుంచి తొలగించారు. శైలజ స్థానంలో అదే కేజీబీవీలో విధులు నిర్వర్తిస్తున్న సీఆర్‌టీ ప్రియాంకను తాత్కాలిక ఇన్‌చార్జ్ ఎస్‌ఓగా నియమించారు.

పొలం గట్లే పిల్లలకు దారి..



మంచ్యతండా ప్రాథమిక పాఠశాల భవనం



పొలం గట్లపై నడుస్తున్న పాఠశాల విద్యార్థులు

- రహదారి లేని మంచ్యతండా పాఠశాల
- ఇరుకు గదిలోనే 30 మంది విద్యార్థులకు బోధన
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

మరిపెడ రూరల్: మారుమూల పల్లెలు, గిరిజన తండాల్లోని పలు పాఠశాలలు పొలాల మధ్య ఉండడంతో సరైన రహదారులు లేవు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు తిప్పలు తప్పడంలేదు. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని మంచ్యతండాలో 20 ఏళ్ల క్రితం పొలాల మధ్య పాఠశాల ఏర్పాటు చేశారు. అందులోనే అంగన్‌వాడీ కేంద్రంతోపాటు పాఠశాల నిర్వహణ కొనసాగుతోంది. అంగన్‌వాడీ కేంద్రంలో 10 మంది చిన్నారులు, ప్రాథమిక పాఠశాలలో 20 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కాగా, గదిలో ఐదో తరగతి వరకు విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు బోధిస్తుండగా.. వరండాలో అంగన్‌వాడీ పిల్లల ఆలనా పాలన చూస్తున్నారు. కాగా దారి లేకపోవడంతో విద్యార్థులు, చిన్నారులు పొలం గట్ల మీదుగా పాఠశాలకు వెళ్లి, అదే గట్లపై మళ్లీ సాయంత్రం ఇంటికి వస్తున్నారు. ఉపాధ్యాయులు సైతం తమ ద్విచక్రవాహనాలను రోడ్డుపై నిలిపి, గట్ల వెంబడి పాఠశాలకు వెళ్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పొలం గట్లు తడిసిపోయి పిల్లలు జారి కింద పడిపోతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు తక్షణమే అదనపు గదులతో పాటు, రహదారిని ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, మంచ్యతండా వాసులు కోరుతున్నారు.



భీమునిపాద జలపాతంలో పర్యాటకుల సందడి

గూడూరు: మండలంలోని సీతానగరం శివారు కొమ్ములవంచ సమీప భీమునిపాద జలపాతంలో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవుదినం కావడంతో అధిక సంఖ్యలో తరలొచ్చారు. దీంతో జలపాతం ఎకో డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. కాగా, 'ప్రకృతిసోయగం..భీమునిపాదం.. అనే శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో పర్యాటకుల తాకిడి ఎక్కువ ఉందని ఆర్చ్ వద్ద టోకెన్ టికెట్ ఇచ్చే ఉద్యోగి సురేశ్ తెలిపారు.